# ఆదుకోవడమే మానవత్వం

- ఓల్డ్ జైల్ ఖానా వద్ద దుకాణాల ప్రారంభోత్సవంలో సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

మారేడ్‌పల్లి, డిసెంబర్ 7: సాటి మనిషి కష్టాల్లో ఉన్నప్పుడు ఆదుకోవడమే మానవత్వానికి నిదర్శనమని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మోండా డివిజన్‌లోని ఓల్డ్ జైల్ ఖానా వద్ద సెప్టెంబర్‌లో టైలరింగ్ దుకాణాలు కూలిపోయిన విషయం విదితమే. కూలిన షాపుల స్థానంలో నూతనంగా పునర్‌నిర్మించారు. శనివారం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టైలరింగ్ వృత్తిని జీవనాధారం చేసుకొని జీవనం సాగిస్తున్న ఆరు కుటుంబాలు షాపులు కూలిపోవడంతో తీవ్ర దుఖానికి లోనయిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రమాద విషయాన్ని ప్రభుత్వం, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని కోరితే నేటి వరకు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులకు అండగా ఉండాలని తాను ఒక్కో కుటుంబానికి రూ.20 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించానని వివరించారు. అదేవిధంగా మేరు సంఘం ఆధ్వర్యంలో కుట్టు మిషన్లను పంపిణీ చేయడంతో పాటు ఆర్థిక సహాయం కూడా అందించడం పట్ల వారిని ఈ సందర్భంగా అభినందించారు. ప్రభుత్వం బాధిత కుటుంబాలకు సహాయం అందించకపోగా, దుకాణాల నిర్మాణానికి ఆటంకాలు కలిగించే ప్రయత్నం చేశారని అన్నారు. తాను అన్ని విధాలుగా అండగా ఉంటానని, ధైర్యంగా ఉండాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఆకుల రూప, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఆకుల హరి కృష్ణ, నాయకులు తలసాని స్కైలాబ్‌యాదవ్, నాగులు, మేరు సంఘం ప్రతినిధులు శ్రీనివాస్, వెంకటేశ్, నర్సింగ్‌రావు, నరేందర్, కృష్ణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మోండా డివిజన్ ఓల్డ్ జైల్ ఖానా వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

## డీడీఎంఎస్‌లో వివిధ వొకేషనల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 7: దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా సభ వొకేషనల్ కోర్స్ సెంటర్‌లో పలు కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఫార్మసీ అసిస్టెంట్, హెల్త్‌కేర్ మల్టీపర్పస్ వర్కర్ (నర్స్ కోర్స్), ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్, డయాలసిస్ అసిస్టెంట్, ప్రీ ప్రైమరీ టీచర్ ట్రైనింగ్ తదితర సర్టిఫికెట్ కోర్సుల్లో చేరేందుకు కనీస అర్హత 10వ తరగతి అని వివరించారు. రెస్పిరేటరీ థెరపీ టెక్నీషియన్, ఈసీజీ టెక్నీషియన్, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, కార్డియాలజీ టెక్నీషియన్, రేడియోగ్రఫీ అసిస్టెంట్, క్యాథ్‌ల్యాబ్ టెక్నీషియన్, పర్‌ఫ్యూజన్ టెక్నీషియన్ వంటి పారా మెడికల్ డిప్లొమా కోర్సుల్లో చేరేందుకు కనీస అర్హత ఇంటర్మీడియట్ అని చెప్పారు. అన్ని వయసుల వారు ఈ కోర్సుల్లో చేరేందుకు అర్హులని చెప్పారు. ఈ కోర్సుల్లో చేరేందుకు ఈ నెల 14వ తేదీ ఆఖరు అని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 83090 37134, 63058 95867 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## కల్లుగీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

చిక్కడపల్లి, డిసెంబర్ 7: కల్లుగీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు అంబాల నారాయణగౌడ్ శనివారం బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియా వెంటనే విడుదల చేయాలని అన్నారు. మెడికల్ బోర్డును ఎత్తివేయాలని, 50 ఏండ్లు దాటిన గీతన్నలకు కొత్త పెన్షన్ ఇవ్వాలని అన్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బత్తిని మురహరిగౌడ్, నాయకులు మానస గౌడ్, బైరి మహేందర్‌గౌడ్, దూడల బాగయ్యగౌడ్, మహేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎంపీ సంతోష్‌కు జన్మదిన శుభాకాంక్షలు



మాజీ ఎంపీకి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

చిక్కడపల్లి, డిసెంబర్ 7: గ్రీన్ చాలెంజ్ సృష్టికర్త, మాజీ రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్‌కుమార్‌ను శనివారం ఎమ్మెల్యే ముఠా గోపాల్ కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ముషీరాబాద్ మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు శంకర్‌ముదిరాజ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ కవితను కలిసిన ఎమ్మెల్యే



ఎమ్మెల్సీ కవితను కలిసి ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, డిసెంబర్ 7: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను శనివారం ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకుడు గడ్డమీది శ్రీనివాస్ కలిశారు. కార్యక్రమంలో ముషీరాబాద్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్ పాల్గొన్నారు.

# అంబేద్కర్ స్ఫూర్తితో ఉత్తరాధిపత్యంపై యుద్ధం




కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 7: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ స్ఫూర్తితో ఉత్తరాధిపత్యంపై యుద్ధం మొదలైందని దక్షిణ భారత రాజకీయ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ అన్నారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా 'ఉత్తరాది ఆధిపత్యం–దక్షిణాది ఉద్యమం: ఎందుకు' అంశంపై ఉస్మానియా యూనివర్సిటీ పీజీఆర్ఆర్‌సీడీఈ మినీ సెమినార్ హాల్‌లో ప్రసంగ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సమావేశంలో ప్రముఖ డేటా సైంటిస్ట్ ఆర్ఎస్ నీలకంఠన్ రచించిన 'సౌత్ వర్సెస్ నార్త్' పుస్తకంపై సమీక్షను సైతం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు గడిచినా హైదరాబాద్‌ను దేశ రెండో రాజధానిగా చేయలేదని మండిపడ్డారు. సుప్రీం కోర్టు బెంచ్‌ను సైతం దక్షిణ భారతంలో ఏర్పాటు చేయలేదని దుయ్యబట్టారు. దక్షిణాదికి ప్రత్యేక రిక్రూట్‌మెంట్ బోర్డు, ద్రవిడ భాషల అభివృద్ధి కేంద్రం, పార్లమెంట్ భవనం ఏర్పాటు కలలుగానే మిగిలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో పేర్కొన్న హామీలను నెరవేర్చలేదని ఆరోపించారు. 2026లో జరిగే పార్లమెంట్ నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ తరువాత 30 ఎంపీ స్థానాలు కోల్పోయి 100 సీట్లకు దక్షిణాది పరిమితం అవుతుందని వివరించారు. దక్షిణాది అస్తిత్వం కోల్పోయే ప్రమాదముందని ఆయన వాపోయారు. ఆర్ఎస్ నీలకంఠన్ మాట్లాడుతూ కుటుంబ నియంత్రణ పాటించి, అధిక పన్నులు కడుతున్నందుకు దక్షిణాదికి విధించే శిక్ష ఇది అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో దక్షిణ భారత దళిత మేధావుల ఫోరం కోఆర్డినేటర్ డాక్టర్ ఎంఎఫ్ గోపీనాథ్, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన అభిగౌడ, సుందర్‌రాజ్, విద్యార్థి నాయకులు వేల్పుల సంజయ్, కొత్తపల్లి తిరుపతి, పవన్, బోయ శంకర్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదం వ్యక్తి మృతి

మేడ్చల్: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌లో పరిధిలో జరిగింది. పట్టణ పరిధి క్లాసిక్ దాబా వద్ద తూప్రాన్ వైపు వెళ్తున్న బైక్‌ను లారీ ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తి కింద పడటంతో తలపై నుంచి లారీ వెళ్లింది. దీంతో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు.

# లక్ష్య సాధన కోసం నిరంతరం శ్రమించాలి



కార్యక్రమానికి హాజరైన విద్యార్థులతో అధ్యాపకులు

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 7: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, లక్ష్యాల సాధన కోసం నిరంతరం శ్రమించాలని పలువురు అధ్యాపకులు పిలుపునిచ్చారు. ఓయూ కెమిస్ట్రీ విభాగంలో ఎమ్మెస్సీ మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ విద్యార్థులు తమ చదువుతో పాటు అదనపు నైపుణ్యాలను సైతం నేర్చుకోవాలని చెప్పారు. ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా తమను తాము తీర్చిదిద్దుకున్నప్పుడే ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉపాధి అవకాశాలు విస్తృతంగా లభిస్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో విభాగం హెడ్ ప్రొఫెసర్ మనోహర్, ప్రొఫెసర్ రాంచందర్, ప్రొఫెసర్ హరిపద్మశ్రీ, డాక్టర్ మురళీధర్‌రెడ్డి, మేడతి క్లాసెస్ డైరెక్టర్ శ్రీనివాస్, ది ఫార్మా ట్రైనింగ్ సీఈవో గిరి తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల అభివృద్ధికి త్వరలోనే నిధులు




నాగెల్లి దుర్గయ్య ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల భవనం

బేగంపేట్, డిసెంబర్ 7: రాంగోపాల్‌పేట్ డివిజన్ సుభాష్‌రోడ్డులో ఉన్న నాగెల్లి దుర్గయ్య ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల అభివృద్ధి చెందనుంది. పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు ఎంపీ నిధులు మంజూరు చేయనున్నారని స్థానిక ఎంఐఎం నాయకుడు అశోక్ తెలిపారు. బడి నిర్మించి 60 ఏండ్లు దాటిందని, మరమ్మతు పనులు చేయాలని ఎంపీ అసదుద్దీన్ దృష్టికి తీసుకువెళ్లడంతో ఎంపీ నిధులు మంజూరు చేస్తామని ఎంపీ హామీ ఇచ్చినట్టు తెలిపారు. శనివారం పాఠశాల ప్రాంగణాన్ని ఎంఐఎం నాయకులు పరిశీలించారు. పాఠశాలలో ఫ్లోరింగ్, భవనానికి రంగులు, పేరుకుపోయిన వ్యర్థాల తరలింపు, ప్రమాదకర స్థాయిలో పెరిగి వృక్షాలు, శానిటేషన్ వర్క్స్ సమస్యలను గుర్తించారు. త్వరలోనే నాగెల్లి దుర్గయ్య పాఠశాల అభివృద్ధి చెందనుందని పాఠశాల హెచ్ఎం వెంకళ్వర్లు, విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలల ప్రస్తుతం సుమారు 35 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని హెచ్ఎం తెలిపారు. విద్యార్థుల సంఖ్యను మరింత పెంచేందుకు కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు.


## ఫణి నారాయణకు పురస్కారం ప్రదానం



ఫణి నారాయణకు పురస్కారాన్ని అందజేసిన సాహితీవేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం

ముషీరాబాద్, డిసెంబర్ 7: శ్రీశ్యామ గాయత్రి మ్యూజిక్ అకాడమి 11వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం చిక్కడపల్లి త్యాగరాయగానసభలో నిర్వహించిన సుస్వర సంగీత విభావరి శ్రోతలను అలరించింది. గాయకులు ఆలపించిన మధురగీతాలు రంజింపజేశాయి. కార్యక్రమంలో సాహితీవేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం ముఖ్య అతిథిగా పాల్గొని ప్రముఖ కళాకారుడు వడలి ఫణి నారాయణకు బ్రహ్మ బిరుదు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మ్యూజిక్ అకాడమి స్థాపకురాలు శివపార్వతి, సీహెచ్ త్రినాథ రావు, అన్నపూర్ణ, లక్ష్మీశేషాచార్యులు, వెంకటరావు, చేపూరి లక్ష్మి పాల్గొన్నారు.

## వివాదాల పరిష్కారానికి కమిటీ నియమించాలి



ముషీరాబాద్, డిసెంబర్ 7: ప్రసిద్ధి గాంచిన హెబ్రోన్ చర్చి సమస్యలు, వివాదాల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక కమిటీని నియమించాలని సినార్డ్ ఆఫ్ తెలంగాణ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. శనివారం సినార్డ్ ఆఫ్ తెలంగాణ అధ్యక్షతన అన్ని క్రైస్తవ సంస్థల ప్రతినిధులతో హెబ్రోన్ సంస్థల అధ్యయన సభ ముషీరాబాద్‌లో జరిగింది. సియాన్ ఫెలోషిప్ రెవరెండ్ వై.మోహన్‌బాబు, ఎస్పీజీ చర్చి బిషప్ మోజస్ ఆశీర్వాదం, సీఎస్ఐ చర్చి రెవరెండ్ డాక్టర్ టి.భాస్కర్, రెవరెండ్ ఎడ్వర్డ్ రోస్, రెవరెండ్ గేరా, ప్రతినిధులు హాజరై వివాదాలపై చర్చించారు. పదేండ్లుగా భక్తులు సమర్పించిన కానుకలను ఫీటర్ అవకతవకలకు పాల్పడగా, మిగతా ఎనిమిది ఏండ్లుగా వీరాచారి దోచుకున్నారని ఆరోపించారు. భక్తులు సమర్పించిన కానుకలపై ప్రశ్నించడానికి భక్తులకు అధికారం లేదని చెప్పడం శోచనీయమన్నారు. ఈ విషయాలను సీఎంను కలిసి వివరించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో సంజయ్, డేవిడ్ సుధాకర్, జోనాతన్ ఎడ్వార్డ్, ప్రసాద్‌చౌదరి, ఐపీఎస్ అధికారి బాబురావు, బ్రదర్ ఆరేపల్లి రాజేందర్, బ్రదర్ రాయిడిన్ తదితరులు పాల్గొన్నారు.

## ఫాసిస్టు విధానాన్ని ఎండగట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న దీపాంకర్ భట్టాచార్య

ఖైరతాబాద్, డిసెంబర్ 7 : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ఫాసిస్టు విధానాన్ని ఎండగట్టాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం తన ఫాసిస్టు విధానాలతో రాజ్యాంగాన్ని మనువాద రాజ్యాంగంగా మార్చేందుకు కుట్ర చేస్తుందన్నారు. అమెరికా ప్రభుత్వం అదాని, అతని అల్లుడిపై అతి పెద్ద కుంభకోణాన్ని ఆపాదిస్తూ అరెస్టు వారెంటు జారీ చేసినా ప్రధాని మోదీ ప్రభుత్వం ఎందుకు మౌనం పాటిస్తుందని ప్రశ్నించారు. అదానిని వెంటనే అరెస్టుచేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని, కేవలం ఉచిత బస్సు, 200 యూనిట్ల కరెంటు మాత్రమే అమలవుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో ప్రతిపక్ష, వామపక్ష పార్టీలకు చెందిన వారిని అరెస్టులు చేయడం విచారకరమన్నారు. తద్వారా నియంత లక్షణాలు బహిర్గమవుతున్నాయన్నారు. కమ్యూనిస్టులు పాలకుల ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలన్నారు. సమావేశంలో సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పోలిట్ బ్యూరో సభ్యులు శంకర్, కేంద్ర కమిటీ సభ్యులు నైనాలశెట్టి మూర్తి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మామిండ్ల రమేశ్ రాజా తదితరులు పాల్గొన్నారు.

# నూతన జాతీయ విద్యా విధానాన్ని వ్యతిరేకించాలి




ఆర్ట్స్ కళాశాల ఆవరణలో విలేకరుల సమావేశం అనంతరం నినదిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 7: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాబోయే అసెంబ్లీ సమావేశాలలో నూతన జాతీయ విద్యా విధానం–2020ను వ్యతిరేకిస్తూ తీర్మానం చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా కరోనా కరాళనృత్యం చేస్తున్న సమయంలో బీజేపీ ప్రభుత్వం నూతన విద్యావిధానంపై పార్లమెంట్‌లో ఎటువంటి చర్చ లేకుండా నియంతృత్వంగా ఏకపక్షంగా ఆమోదం తెలిపి అమలు చేస్తోందని మండిపడ్డారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేశ్, ఓయూ అధ్యక్షుడు లెనిన్, కార్యదర్శి నెల్లి సత్య మాట్లాడుతూ నూతన విద్యావిధానం పేరుతో ఆర్ఎస్ఎస్ విద్యా విధానాన్ని తీసుకువచ్చి విద్యా వ్యవస్థలో మతతత్వ పోకడలు, సామాజిక అసమానతలు, సాంఘిక దురాచారాలను పెంచి పోషించేవిధంగా ఉందని ఆరోపించారు. నూతన విద్యా విధానం ద్వారా ప్రభుత్వ విద్యను కార్పొరేటీకరణ చేస్తూ రాజ్యాంగ పీఠికలోని మౌలిక సూత్రాలకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అసెంబ్లీలో నూతన విద్యా విధానాన్ని వ్యతిరేకిస్తూ తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆరెకంటి సాయి భగత్, అశ్వన్, రాఘవేంద్ర, సంతోష్, మహేశ్, సలీం తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు లంచ్ బాక్స్‌ల పంపిణీ



విద్యార్థులకు లంచ్‌బాక్స్‌లను అందజేస్తున్న బెనర్జీ

బన్సీలాల్‌పేట్, డిసెంబర్ 7: బోయిగూడలోని సున్నంబట్టి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని 150 మంది విద్యార్థులకు అడ్రియెల్ చారిటబుల్ ట్రస్ట్ తరపున లంచ్ బాక్స్‌లను అందజేశారు. శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపక, డైరెక్టర్ పీపీ బెనర్జీ మాట్లాడుతూ తమ ట్రస్ట్ ద్వారా ప్రతిఏటా అనేక సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ట్రస్ట్ సభ్యులు మాధురి, జాషువ, భానుప్రకాశ్, బాబు, చిన్న, శ్రీనివాస్, పాఠశాల హెచ్ఎం పుష్పలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జైలు అదాలత్.. 45 కేసులు పరిష్కారం

చర్లపల్లి, డిసెంబర్ 7 : చర్లపల్లి కేంద్ర కారాగారంలో శనివారం జైలు అదాలత్ నిర్వహించి.. 45 కేసులను పరిష్కరించి, 26మంది ఖైదీలకు విముక్తి కల్పించారు. కేంద్ర కారాగారంలో జిల్లా రెండవ అదనపు జూనియర్ జడ్జి జె.ప్రశాంతి, 9వ అదనపు మెట్రోపాలిటన్ జడ్జి ఎస్.ఆర్.దిలీప్‌కుమార్ నాయక్‌లు పాల్గొన్ని పలువురు ఖైదీలను విచారించి.. కేసులను పరిష్కరించారు. అనంతరం ఖైదీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర కారాగారంలో ఖైదీలకు కల్పిస్తున్న సౌకర్యాలను వారు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ రామచంద్రం, డిప్యూటీ సూపరింటెండెంట్లు శశికాంత్, శ్రీనునాయక్, రత్నం, జైలర్లు, డిప్యూటీ జైలర్లు పాల్గొన్నారు.

## గిరిజన న్యాయవాదులకు అవకాశం కల్పించాలి

చిక్కడపల్లి, డిసెంబర్ 7: గిరిజన న్యాయవాదులకు అన్ని శాఖల్లో అవకాశాలు కల్పించాలని ట్రైబల్ లాయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కిషన్‌రాజ్‌చౌహాన్ అన్నారు. బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గిరిజన న్యాయవాదులకు జీపీ, ఏజీపీ, పీపీల్లో ప్రభుత్వం అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ట్రైబల్ జూనియర్ అడ్వకేట్లకు రూ.5వేల స్టైఫండ్ ఇవ్వాలని కోరారు. సమావేశంలో సీనియర్ అడ్వకేట్ సాయిచక్రవర్తి, అసోసియేషన్ సలహాదారుడు రమేశ్‌నాయక్, ప్రధాన కార్యదర్శి మంగులాల్ రాథోడ్, ఉపాధ్యక్షుడు శత్రునాయక్, ప్రోనీత్‌నాయక్, జ్యోతిజాదవ్, జనాకిరామ శ్రీనివాస్‌నాయక్ పాల్గొన్నారు.



సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు కిషన్‌రాజ్‌చౌహాన్

## చట్టసభల్లో వాటా కోసం పోరాడుదాం

ఉప్పల్, డిసెంబర్ 7: చట్టసభల్లో పద్మశాలీల వాటా కోసం పోరాడు దామని అఖిల భారత పద్మశాలి సంఘం పూర్వ జాతీయ అధ్యక్షుడు ఈగ మల్లేశం అన్నారు. ఉప్పల్ ఈస్ట్ కళ్యాణపురి కమ్యూనిటీహాల్‌లో ఉప్పల్ నియోజకవర్గ పద్మశాలి ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీలు పాల్గొన్నారు.

## వేర్వేరు చోట్ల ఆరుగురి అదృశ్యం

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 7: వేర్వేరు చోట్ల ఆరుగురు అదృశ్యమయ్యారు. ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘట్‌కేసర్‌కు చెందిన ఇద్దరు బాలికలు ఓ దుకాణంలో పని చేస్తున్నారు. రోజూ మాదిరిగా శుక్రవారం ఉదయం పనికి వెళ్లారు. సా యంత్రం తిరిగిరాలేదు. దీంతో ఆందోళనకు గురైన తల్లి దండ్రులు వెతికినా ఆచూకీ లేకపోవటంతో శనివారం పోలీసులను ఆశ్రయించి ఫిర్యా దు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఇన్‌స్పెక్టర్ పరశురాం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### కిరాణా దుకాణానికి వెళ్లొస్తానని

జవహర్‌నగర్: జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాలాజీనగర్ మహంకాళీ ఆలయం సమీపంలో మామిండ్ల సుజాత, భర్త సాయికుమార్, ఇద్దరు పిల్లలతో కలిసి నివసముంటున్నారు. పెద్ద కుమార్తె సంధ్యారాణి(22) బోడుప్పల్‌లోని నివసించే మధుతో ప్రేమలో పడి గతనెల 5న ఇంట్లోంచి వెళ్లింది. తిరిగి 15న ఇంటికి వచ్చింది. ఈనెల 7న కిరాణా దుకాణానికి ఇద్దరు కుమార్తెలతో కలిసి వెళ్లారు. డబ్బులు తీసుకురావడానికి సంధ్యారాణి తన సోదరి శ్రీలతను ఇంటికి పంపించింది. శ్రీలత దుకాణానికి తిరిగి వచ్చేసరికి సంధ్యారాణి కనిపించలేదు. దీంతో సంధ్యారాణి ఆచూకీ కోసం వెతికినా సమాచారం లభించలేదు. కుటుంబసభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ తెలిపారు.

### భర్త మందలింపుతో..

జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సంతోష్‌నగర్‌లో బత్తుల శ్రీకాంత్, భార్య వెంకటలక్ష్మి, కుమార్తె రాజేశ్వరి(11), కుమారుడు రాహుల్(6)తో కలిసి నివసిస్తున్నాడు. శ్రీకాంత్ కారు డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. భార్య వెంకటలక్ష్మి(33) ఆరోగ్యం బాగోలేకపోవడంతో తరచూ శ్రీకాంత్ మందలించడంతో మనస్తాపం చెందింది. ఈనెల 4న ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఇద్దరు పిల్లలను తీసుకుని బయటకు వెళ్లి ఇంత వరకు తిరిగి రాలేదు. దీంతో వెంకటలక్ష్మి, పిల్లల ఆచూకీ కోసం వెతికినా సమాచారం లభించలేదు. భర్త శ్రీకాంత్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సైదయ్య తెలిపారు.